క్లుప్తంగా

సీఐ రవిరాజు బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు : స్థానిక సీఐగా డి.రవిరాజు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను పోలీసు సిబ్బంది, స్థానికులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయమని చెప్పారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే బాధితులకు న్యాయం అందిస్తామని తెలిపారు. బాధితులు నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఎస్సైకి సన్మానం



శాయంపేట : స్థానిక ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా దామెరుప్పుల దేవేందర్‌ను బీజేపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, మండల అధ్యక్షుడు గడ్డం రమేష్ మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఉప్పు రాజు, మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, నాయకులు కుక్కల మహేష్, మేకల సుమన్, కోమటి రాజశేఖర్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సత్కారం



ఐనవోలు : స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వంగాల నవీన్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పూలబోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుప్పెల్లి కొంరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పల్లకొండ సురేష్, యూత్ మండల అధ్యక్షుడు మరుపట్ల నరేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్బాస్ అలీ, సోషల్ మీడియా అధ్యక్షుడు గూబ అరుణ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్, నాయకులు సింగారపు రాజు, చింత అశోక్ పాల్గొన్నారు.

నగదు, బంగారం చోరీ



ఐనవోలు : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వంగాల నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్లకొండ రాజేష్ కుటుంబం ఉదయం ఇంటికి తాళం వేసి వనభోజనాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న రాజేష్ కుటుంబీకులు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళంతోపాటు బీరువా తాళం పగులగొట్టి రూ.80 వేల నగదు, అర తులం బంగారం చోరీ చేశారు. రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

నివాళి



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన కొత్తూరు బుడంకాయల సమ్మయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆయన మృతదేహానికి వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మార్నేని మధుమతి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మునిగాల సంపత్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉపసర్పంచ్ సతీష్, మాజీ ఎంపీటీసీ జ్యోతి, అశోక్, మహేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నుంచి ఇద్దరి సస్పెన్షన్

శాయంపేట : మండలానికి చెందిన మామిడి రాజమణిని, ఆమె కొడుకు రాజశేఖర్‌ను సీపీఐ నుంచి సస్పెండ్ చేసినట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమణి, రాజశేఖర్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న క్రమంలోనే చర్య తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఎవరు పార్టీకి నష్టం చేకూరేలా వ్యవహరించినా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి



కమలాపూర్ : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి

కమలాపూర్ : కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) పని చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. ఆ సంఘం 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలోని కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం రాజకీయాల పార్టీలకు అతీతంగా సంఘం పోరాడుతోందని తెలిపారు. ఉచిత విద్యుత్ పేరిట రైతుల పేరు చెప్పి విద్యుత్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ బినామీ కంపెనీలకు దోచిపెడుతోందని విమర్శించారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ్ ఎన్పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ రావుల రమణరెడ్డి, సెక్రెటరీ మన్నె శశికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్తమ్ రాజేష్, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, మాదన్నపేట ఎంపీటీసీ కొండం శ్రీనివాస్, నాయకులు తుమ్మ శోభన్, జన్ను రమేష్, పుల్ల ఐలయ్య, శోభన్, కళ్యాణ్, రాణా ప్రతాప్, భాస్కర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని అంగడి చౌరస్తాలో బీఎంఎస్ జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అడగాని జనార్దన్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయా పార్టీలకు అతీతంగా 2 కోట్ల సభ్యత్వాలతో దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు కొండా ప్రతాప్, బొమ్మకంటి కుమార్, గాజర్ల సదానందం, కాంబత్తుల రమేష్, మేరుగు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పరకాల : జెండా ఆవిష్కరిస్తున్న జనార్దన్‌రావు



శాయంపేటలో..

శాయంపేట : తాపీ మేస్త్రీ సంఘం అధ్యక్షుడు పి.ఓదెలు జెండా ఆవిష్కరించగా జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, రాజు, రమేష్, కుమారస్వామి, శ్రీనివాస్, వీరన్న, శేఖర్, రామస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధిలో అధికారుల నిర్లక్ష్యం

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని గ్రామాల అభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం గరంగరంగా సాగింది. వివిధ శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. రానున్న ఖరీఫ్ సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించడానికి ఏఈఓలు రైతు వేదికల్లో అందుబాటులో ఉంటారని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పద్మ తెలిపారు. రైతులు వరి, పత్తి, మొక్కజొన్న పంటలే కాకుండా ఉద్యాన వన పంటలు సాగు చేయాలని ఆమె సూచించారు. నీటి సరఫరాలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలు గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని పలు గ్రామాలకు బస్సులు రావడం లేదని, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ సమ్మిరెడ్డి మాట్లాడారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజర్ కావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సబ్ సెంటర్ల నిర్మాణంలో జాప్యం చేయకూడదని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ,ప్రస్తుత వర్ష కాలంలో వచ్చే వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొత్తగా ఏర్పడిన వేలేరు మండల అభివృద్ధికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. మండల సభకు అధికారులు, ప్రజాప్రతినిదులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ మోహన్, వైస్ ఎంపీపీ ఆంగోతు సంపత్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ జానీ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాయిత మాధవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్' ఘటనను ఖండించండి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

శాయంపేట : మణిపూర్‌లో గిరిజన మహిళలపై అఘాయిత్యాలను సమాజంలోని ప్రతిఒక్కరూ ఖండించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారానికి పాల్పడడం భారత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా అభివర్ణించారు. నిందితులను కేంద్ర, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిందం రవి, గజ్జి ఐలయ్య, దుబాసి కృష్ణమూర్తి, మారెపల్లి రవీందర్, రఫీ, రాజేందర్, రాజు, చిరంజీవి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం



నడికూడ : మండల కేంద్రానికి చెందిన జంగిలి ఉపేంద్ర ఇటీవల అనారోగ్యం బారిన పడగా ఆమెకు నాగుర్ల యువసేన నాయకులు వైద్యం కోసం ఆదివారం ఆర్థికసాయం అందించారు. తొలుత పరామర్శించారు. అనంతరం వరికెల కిషన్‌రావు మాట్లాడారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో స్వీపర్‌గా సేవలు అందిస్తున్న పేదరాలు ఉపేంద్ర అనారోగ్యం బారిన పడడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకాటి నగేష్, రాకేష్ ,లేనే సతీష్, సురావు చిరంజీవి, గోనెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

కమలాపూర్ : డిమాండ్ల సాధన కోసం జీపీ కార్మికులు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె ఆదివారం 18వ రోజుకు చేరుకుంది. సమ్మెలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఐలయ్య మాట్లాడరాఉ. జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని, జీఓ నంబర్ 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు జి.రమేష్, ప్రధాన కార్యదర్శి వి.రాజయ్య, సలహాదారు వై.స్వామి, జిల్లా నాయకులు భాస్కర్, అరుణ, ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన సంఘరేని పవన్‌కుమార్ ఇటీవల ప్రమాదానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆదివారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. పవన్‌కుమార్ మృతి బాధాకరమన్నారు. అనాథలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఉద్యమకారులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. బాధితలకు ఎలాంటి సహాయమైన సకాలంలో అందించే దిశగా చొరవ తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యమకారులు బాబుమియా, సాంబలక్ష్మీ, లింగమూర్తి, ఎర్రన్న, వడ్డేపల్లి నర్సయ్య, రాజయ్య, కోటయ్య, నాగేల్లి స్వామి, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే హక్కుల సాధన

- మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్



నూతన కమిటీతో పులి దేవేందర్, తదితరులు

ఆత్మకూరు : ఉద్యమాలతోనే హక్కులను సాధించుకోగలమని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల దేవేందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి పులి దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ముదిరాజ్ సంఘాలు ఏకమై ముదిరాజ్ కులానికి చెందిన నాయకులకు సముచిత ప్రాధాన్యత లభించేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయి నుంచే సంఘాన్ని బలోపేతం చేయనున్నట్టు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా విద్య, ఉద్యోగ సాధికారత కోసం సంఘం పాటుపడుతోందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల దేవేందర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి పిట్టల రమేష్ మాట్లాడుతూ ఐక్యతతోనే సంఘ అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం మెపా మండల కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడుగా తక్కళ్లపెల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా బయ్య పైడి, ఉపాధ్యక్షులుగా బయ్య రవికుమార్, మోటం సతీష్, గౌరవ సలహాదార్లుగా పోలు రాజేష్, వీర్ల రాజు, సంయుక్త కార్యదర్శులుగా వీర్ల రణధీర్, బయ్య లక్ష్మణ్, కోశాధికారిగా పాండవుల ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా జంగ శ్రీకాంత్, బయ్య వినయ్, గండి శ్రవణ్, బయ్య రామకృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు తక్కళ్ల నరేష్, కుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ సుందర్‌రాజ్

కమలాపూర్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో చేపట్టిన పద్మశాలి కమ్యూనిటీ హాల్, మార్కండేయ భవనం, పెద్దమ్మ ఆలయ నిర్మాణ పనులను ఆదివారం ఆయన సందర్శించి పరిశీలించి పర్యవేక్షించారు. అభివృద్ధి పనులను రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టినట్టు తెలిపారు. రెండు నెలల్లోగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. అనంతరం పద్మశాలి సంఘం భవన నిర్మాణానికి అదనంగా నిదులు మంజూరు చేయాలని కోరుతూ ఆ సంఘం సభ్యులు చైర్మన్ సుందర్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఈ రఘు, ఏఈ జలాల్, కమలాపూర్ పద్మశాలి అభివృద్ధి కమిటీ సభ్యులు మార్గం భిక్షపతి, ప్రధాన కార్యదర్శి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఆత్మకూరు : వ్యాస పూర్ణిమ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అక్కంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గుజ్జుల రామచంద్రంను హనుమకొండలోని సామ జగన్ భవన్‌లో ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంతోపాటు విద్యార్థులను పోత్సహించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా రామచంద్రం కృషి చేసిన తీరును ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు చిదురాల సుధాకర్, గోకి భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాధిక ఎంపిక

ధర్మసాగర్ (వేలేరు) : టీపీయూఎస్ వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలోని మండల ప్రజాపరిషత్ స్కూల్ ఉపాధ్యాయురాలు మూల రాధికను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. గురుపూజోత్సవం (వ్యాస పౌర్ణమి) సందర్భంగా ఆమెను హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, భాస్కర యోగి, హనుమకొండ జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రాధ చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందించి సన్మానించారు. రాధికను ఎర్రబెల్లి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, తదితరులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

ఆత్మకూరు : పండ్ల తోటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పరకాల ఉద్యాన వన శాఖ అధికారి మధులిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదెకరాలలోపు భూమి, ఈజీఎస్ జాబ్ కార్డ్ కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు నూరు, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడంతోపాటు పెట్టుబడి సాయం చేయనున్నట్టు వివరించారు. ఈజీఎస్ జాబ్ కార్డ్, పట్టాపాస్ బుక్, ఆర్వోఎఫ్ఆర్ బుక్ కలిగి ఉండి, బోర్ లేదా బావి ఉండి, విద్యుత్ కనెక్షన్ కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులను గ్రామసభ తీర్మానం ద్వారా ఎంపిక చేసి సాయం అందిస్తారని తెలిపారు. మామిడి, నిమ్మ, నారింజ, కొబ్బరి, డ్రాగన్, సపోట, జామ, సీతాఫలం, మునగ పంటలు సాగు చేసేందుకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో గుంతలు తవ్వి మొక్కలు నాటడంతోపాటు డ్రిప్ అమర్చుతారని తెలిపారు. అలాగే ఒక్కో మొక్కకు మూడేళ్ల పాటు సాగు నిర్వహణను అందజేస్తారని పేర్కొన్నారు. ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రూ.10 లక్షలతో బీసీబంధు ప్రకటించాలి



మాట్లాడుతున్న బెజ్జంకి పూర్ణాచారి

పరకాల : పేద బీసీలకు రూ.10 లక్షలు సాయం అందించేలా బీసీబంధు పథకాన్ని ప్రకటించాలని ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. బీసీల్లో 132 ఉపకులాలుండగా కేవలం పద్నాలిగిటికి మాత్రమే పథకాన్ని వర్తింపజేసేలా ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం బీసీబంధు పథకాన్ని తెరపైకి తీసుకొచ్చి హడావుడి చేస్తోందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప సభను విజయవంతం చేయండి

కమలాపూర్ : ఆగస్టు రెండో వారంలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి చంద్రమౌళి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 29 ఏళ్లుగా ఉద్యమిస్తున్నట్టు తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరకణ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చినా ఇప్పటివరకు నెరవేర్చలేదని విమర్శించారు. మంద కృష్ణ అధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన విశ్వరూప మహాసభకు మాదిగ, ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ అంకిల్ల రాజు, ఎంఎస్పీ మండల కోఆర్డినేటర్ చిలువరి సంపత్, నాయకులు నద్దునూరి ప్రసాద్, నద్దునూరి కిరణ్, శనిగరపు సుధాకర్, వేల్పకొండ భద్రయ్య, అల్లకొండ శంకర్, ఇసంపల్లి స్వామి, అంబటి భూమయ్య, అంకెల రాజమల్లు, ఇసంపెల్లి ప్రేమ్ సాగర్, ఎలుకటి పైడయ్య, జన్ను రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యఉద్యమాలతోనే ఇళ్ల పట్టాల సాధన

శాయంపేట : ఐక్యఉద్యమాలతోనే పేదలు ఇళ్ల పట్టాలు సాధించుకోగలరని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. మండలంలోని పెద్దకొడెపాక శివారులో పేదలు గుడిసెలు వేసి 200 రోజులు గడచిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఉత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇల్లు లేని నిరుపేదలకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. ప్రజారోగ్యానికి నష్టం కల్పిస్తున్న పెద్దకోడెపాక శివారులోని క్రషర్లను, క్వారీలను మూసేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల పట్టాల సాధన కోసం ఈనెల 7న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్టు తెలిపారు. ఆటపాటలతో సందడి చేశారు. గుడిసెల వద్ద మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, పరకాల కార్యదర్శి దుప్పటి సాంబయ్య, మండల నాయకులు బత్తిని సదానందం, అనుకారి అశోక్, అరికిల్ల దేవయ్య, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాడీషీటర్లకు కౌన్సెలింగ్



పరకాల : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పలువురు రౌడీషీటర్లకు స్థానిక సీఐ వెంకటరత్నం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. నేరాలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. శాంతియుత జీవనం సాగించాలని సూచించారు. ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడ్డా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సత్ప్రవర్తనతో మెలిగితే భవిష్యత్‌లో రౌడీ షీట్ ఎత్తివేసే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సైలు హరికృష్ణ, ప్రశాంత్‌బాబు, శివకృష్ణ పాల్గొన్నారు.

నేడు సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశం

పరకాల : నేడు (సోమవారం) పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ యూత్ సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నట్టు మండల అధ్యక్షుడు శాతరాసి సనత్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసంనాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. నేటి సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సిలువేరు మొగిళి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, యూత్ నాయకులు సిలువేరు రాఘవ, పల్లెబోయిన మహేశ్, నాగ శ్రీకాంత్, దొమ్మటి అంబేద్కర్, అంబరగొండ రాజేష్, రమేష్, అజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాంరెడ్డి జన్మదిన వేడుకలు



శ్రీరాంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

దామెర : దామెర సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి జన్మదిన వేడుకలను వరంగల్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంరెడ్డి అభిమానులు, బీజేపీ నాయకులు ఆయన్ను గజమాలతో సత్కరించి పూలబోకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజలకు సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి స్పాట్ అడ్మిషన్లు

పరకాల : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 28 నుంచి మెకానికల్, ఈసీఈ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన (ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన) అభ్యర్థులు ఈనెల 25 నుంచి 27 సాయంత్రం 4 గంటలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలని తెలిపారు. ట్యూషన్, ప్రాసెసింగ్ ఫీజులు వెంటనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ వర్తించదని స్పష్టం చేశారు. వివరాల కోసం పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.